క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

వీనుల విందుగా భక్తి గీతాలాపన



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని పద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం భక్తి గీతాలు, సినీ గీతాల విభావరి వీనుల విందుగా సాగింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఘంటసాల, భానుమతి స్వరపరిచిన సినీ గీతాలు, అన్నమాచార్య భక్తి గీతాలను ఎస్‌కే.బాపూజీ, బంగారు పాప దంపతులు ఆలపించి భక్తుల్ని పరవశింపచేశారు. అనంతరం దేవాలయ పాలకవర్గం ఇద్దరిని సత్కరించింది.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మధువని సుస్వరాల పల్లకి సంస్థ వ్యవస్థాపకులు విరిశల మధుబాబు ఆధ్వర్యంలో సుస్వర గీత మాలికలు శీర్షికన ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. అన్నదాన సమాజం చైర్మన్ పోకల వసంత్, కార్యనిర్వహణాధికారి ప్రమీలారాణి, పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, గాదె రత్నారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయకులు వై.హేమమాలిని, భారతి, పి. కృష్ణారావు, కె. శివప్రసాదరావు, ఎస్. సాంబశివరావు, సీహెచ్. రవికాంత్, టి. సాయిబాబా, మధుబాబు పాటల్ని ఆలపించారు. వీరికి కీబోర్డుపై ఆదామ్, తబలాపై ఎస్. వెంకట్, ప్యాడ్స్‌పై సీహెచ్. ప్రవీణ్ వాయిద్య సహకారం అందించారు. వ్యాఖ్యాతగా శివప్రసాదరావు వ్యవహరించారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు



నెహ్రూనగర్: నగరంలో రోజురోజుకీ మనుష్యులపై కుక్కల దాడి పెరిగిపోతోంది. రోజూ ఏదో ఒకచోట కుక్కల దాడి చేయడం పరిపాటిగా మారిపోయింది. ఆదివారం గోరంట్ల సమీపంలోని అన్నపూర్ణానగర్‌లో ఇంటి బయట ఇల్లు శుభ్రం చేసుకుంటున్న మహిళపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటనలో మహిళ చేతులపై, చెవులను తీవ్రంగా గాయపరచడంతో బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమేశారు.

స్థల వివాదంపై పరస్పర ఫిర్యాదులు

పట్నంబజార్: స్థల వివాదంలో వ్యక్తులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్న ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నూరు రోడ్డులోని ఒక స్థలానికి సంబంధించి గుమ్మ నాగేశ్వరరావు సర్వే నిమిత్తం ఆ శాఖ సిబ్బందిని పిలిపించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో నివాసం ఉండే మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, అతని కుమారుడు చందు దాడి చేసి గాయపరచినట్లు గుమ్మ నాగేశ్వరరావు లాలాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గుమ్మ నాగేశ్వరరావు సైతం వారిని దూషించినట్లు మరో ఫిర్యాదు అందింది. విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని లాలాపేట పీఎస్ఎస్‌హెచ్‌వో ఎం.సుబ్బారావు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎల్‌యూ సీఎస్‌ఐటీ విభాగ అధిపతి డాక్టర్ కె.అమరేంద్ర సూచించారు. సీజన్ వ్యాధులపై చిర్రావూరులో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.అమరేంద్ర మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారని అన్నారు. పరిసరాలు శుభ్రంగా లేకుంటే వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని స్థానికులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ శోభకృత్ సాహితీ వసంతోత్సవానికి సన్నద్ధం

- 26వ వసంతంలోకి సాహితీ సమాఖ్య
- ఉగాది నాడు విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ వసంతోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న సంస్థ సభ్యులు
- ఒకే వేదికపై 25 ఏళ్లుగా వివిధ రంగాల్లో ప్రముఖులకు సత్కారం
- ఇప్పటి వరకు 200 మందికి పైగా పురస్కారాలు
- సాహిత్యాభిమానుల ప్రశంసలు



గొల్లపూడి మారుతీరావును సత్కరిస్తున్న సాహితీ సమాఖ్య సభ్యులు (ఫైల్)

పాత గుంటూరు: సాహిత్యంతో సమాజంలో ఎంతటి మార్పునైనా తీసుకురాగలమనే లక్ష్యంతో నగరంలో సాహితీ సమాఖ్య సంస్థ స్థాపించబడింది. 1997లో సాహిత్యాభిమాని ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ వ్యవస్థాపక కార్యదర్శిగా మిత్ర బృందంతో కలసి నెలకొల్పారు. ప్రతి ఏడాది ఉగాది రోజున 'సాహితీ వసంతోత్సవం' పేరుతో విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత 26 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కలిగిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తూ సత్కరిస్తున్నారు. ఇప్పటి వరకు 200 మందికి పైగా సుప్రసిద్ధ కవులు, కవయిత్రులు, కార్టూనిస్టులు, గురుస్వాములు, యువ కవులకు పురస్కారాలు అందించారు. సినీ ప్రముఖులు కె. విశ్వనాథ్, గుమ్మడి వెంకటేశ్వరరావు, గొల్లపూడి మారుతీరావు, సింగీతం శ్రీనివాసరావు, చంద్రబోస్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, అనంత శ్రీరామ్, వేటూరి సుందరరామ్మూర్తి, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, పాపినేని శివశంకర్, వాడ్రేవు చిన వీరభద్రుడు, కొలకలూరి ఇనాక్, గోరటి వెంకన్న, అందెశ్రీ , వరంగల్ శ్రీనివాస్... ఇలా ఎంతోమందికి ఈ పురస్కారాలు వరించాయి.

విజ్ఞాన మందిరం వేదికగా ఉగాది పండుగ

గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ సమాఖ్య ఉగాది పండుగ రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి సాహితీ వసంతోత్సవ సభను నిర్వహిస్తుంది. పండుగకు ప్రతీకగా ప్రాంగణాన్ని, వేదికను తీర్చిదిద్దుతారు. మామిడి తోరణాలు, అరటి బోదెలు, కొబ్బరి ఆకులు, రకరకాల పూలతో వేదికను అలంకరిస్తారు. సభకు వచ్చే అతిథులంతా సంప్రదాయ దుస్తులతో హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగ పఠనం తర్వాత సాహితీ సమ్మేళనం, అతిథుల ఉపన్యాసాలు, పుస్తకావిష్కరణలు, పురస్కార ప్రదానాలు, కవితా ప్రదర్శనలు రాత్రి పది గంటల వరకూ కొనసాగుతాయి.

అందరూ ఆహ్వానితులే



సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నాం. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ, నాదస్వర కచేరి, పంచాంగ శ్రవణం అనంతరం సభకు కలెక్టర్. యం. వేణుగోపాలరెడ్డి అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు పాల్గొననున్నారు. సుప్రసిద్ధ రచయిత దర్భశయనం శ్రీనివాసాచార్యకు శోభకృత్ సాహితీ పురస్కారం, రచయిత, విశ్లేషకులు బి.ఎస్. శర్మకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నాం. కార్యక్రమంలో సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలి.

– ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, వ్యవస్థాపక కార్యదర్శి, సాహితీ సమాఖ్య

రక్తదానం మహా పుణ్యకార్యం

ఎమ్మెల్యే ముస్తఫా



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రక్తదానం మహా పుణ్య కార్యమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 12వ డివిజన్ పాలాసుపత్రి వద్ద గల ప్రభుత్వ పాఠశాల్లో ఆదివారం రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్, శ్రీ బాలాజీ హాస్పిటల్స్ సౌజన్యంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన వారికి, శస్త్రచికిత్సలు చేసే సమయంలో రక్తం ఎంతో అవసరమని, అటువంటి పరిస్థితుల్లో రక్తదాతలు ముందుకు రావాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థను, రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఖాజామొహీద్దీన్ చిష్టీ, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా, లియాఖత్, వైద్యుడు బి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యాపార సముదాయం ప్రారంభం

కొల్లి శారద కూరగాయాల మార్కెట్ పక్కన వ్యాపార సముదాయాన్ని ఎమ్మెల్యే ముస్తఫా ప్రారంభించారు. పాత గుంటూరు నందివెలుగు రోడ్డు అక్బరీ మసీదులో మందు భాగం రోడ్డు విస్తరణలో కోల్పోవడంతో అక్కడి వ్యాపార సముదాయానికి బదులుగా కొల్లి శారద కూరగాయాల మార్కెట్ పక్కన వ్యాపారస్తులకు కేటాయించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో కార్పొరేటర్లు యిర్రి ధనలక్ష్మి, మెహమూద్, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా, యిర్రి సాయి పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి జైభాగ్యమ్మ

సీపీఎం సీనియర్ నేత మధు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మధు

గుంటూరు రూరల్(ప్రత్తిపాడు): అణచబడిన జాతుల ఆశాదీపం, దళితుల పక్షపాతి జొన్నలగడ్డ జైభాగ్యమ్మని సీపీఎం సీనియర్ నేత మధు కొనియాడారు. ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడులో ఆదివారం దళిత ఉద్యమకారిణి జొన్నలగడ్డ జైభాగ్యమ్మ సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం సీనియర్ నేత మధు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి జైభాగ్యమ్మ చేసిన ఉద్యమాలు వెలకట్టలేనివని తెలిపారు. గొట్టిపాడు గ్రామం నుంచి చివరి రక్తపు బొట్టు వరకు దళితుల కోసం పోరాడిన వీరమహిళ అని కొనియారు. కార్యక్రమానికి జొన్నలగడ్డ ఆంథోనమ్మ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకే), అడ్వకేట్ శాంతకుమార్, కొరివి వినయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడాల సుబ్బారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మరావు, పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనం



తెనాలి: పట్టణానికి చెందిన శారదా సాహితీ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటైన సభకు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షత వహించారు. సమితి కార్యదర్శి డాక్టర్ సామల లక్ష్మణబాబు ఉగాది సందేశం వినిపించారు. కవి సమ్మేళనంలో పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ జ్యోతిస్వరూపరాణి, ఈఎల్‌వీ అప్పారావు, ఆళ్ల నాగేశ్వరరావు, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, పాతూరి సుబ్రహ్మణ్యం, మొవ్వా సుబ్బారావు, మునిపల్లి రఘునాధరావు తమ కవితలను వినిపించారు. అనంతరం కవులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. గ్రంథాలయ పాలకురాలు రమాదేవి శుభాకాంక్షలు తెలిపారు. పొత్తూరు నాగేంద్రం వందన సమర్పణ చేశారు.

నేల సారవంతంతోనే పంట ఆరోగ్యం



గానుగ నూనె తయారీని వివరిస్తున్న రైతు నేస్తం ప్రతినిధులు

గుంటూరు రూరల్: నేల ఆరోగ్యంగా ఉంటే పంటలు కూడా ఆరోగ్యంగా పండుతాయని తమిళనాడుకు చెందిన సేంద్రియ రైతు సుందరరామన్ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఆదివారం సేంద్రియ వ్యవసాయం, ఎరువులు, రసాయనాల తయారీపై నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలు ఆరోగ్యంగా పెరగడానికి అవసరమైన సూక్ష్మజీవులన్నీ నేలలో నిక్షిప్తంగా ఉంటాయని, ప్రస్తుతం వాడే రసాయనాల వల్ల అవి నశిస్తున్నాయని తెలిపారు. దీని వల్ల భూమి కాలుష్యమై, చీడపీడల వల్ల పంట దిగుబడి తగ్గుతుందని వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల భూమి ఆరోగ్యంగా ఉండటంతో పాటు మేలు చేసే సూక్ష్మజీవులు పెరిగి పంటలు బాగా పండుతాయని తెలిపారు. భూమిలో తగు పాళ్లలో సేంద్రియ కర్బన పదార్థం ఉండాలని సూచించారు. అందుకుగానూ పచ్చిరొట్ట ఎరువులు విత్తుకుని భూమిలో కలియదున్నుకోవాలని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులో ఐదు కిలోల సజ్జలు, మూడు కిలోల జొన్నలు, మూడు కిలోల మొక్కజొన్నలు, ఒక కిలో రాగులు, మూడు కిలోల అలసందలు, మూడు కిలోల ఉలవలు, ఒక కిలో నువ్వులు, ఒక కిలో ఆవాలు, మూడు కిలోల ఆముదాలు, మూడు కిలోల జనుములు, నాలుగు కిలోల జీలుగలు కలిపి ఎకరాకు 31 కిలోలు పచ్చిరొట్టగా వేసి 60–65 రోజుల్లో కలియ దున్నాలని సూచించారు. అనంతరం గానుగ నూనె తయారీ, తేనె టీగల పెంపకం, ఐదంచెల పద్ధతిలో వ్యవసాయం తదితర యాజమాన్య పద్ధతుల్ని క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు శబరినాథ్, మీసాల రామకృష్ణ, ఏడుకొండలు, రైతునేస్తం ఫౌండేషన్ మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

5న సీఐటీయూ ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కాకుమాను: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకు తెచ్చిన మూడు నల్ల చట్టాల్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల శాఖ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు కోరారు. కాకుమాను ప్రధాన కూడలిలో ఆదివారం కరపత్రాల్ని కౌలు రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏటా నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌ల ధరల్ని పెంచుకుంటూ పోతోందని ఆరోపించారు. సంపదనంతా కార్పొరేట్లకు దోచిపెడుతూ దేశ ప్రజలపై మరింత పన్నుల భారం మోపుతోందని ధ్వజమెత్తారు. హక్కుల్ని కాలరాస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి దేశంలో కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ నాయకులు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సినిమాలపై చర్చావేదిక



తెనాలి: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ నటించిన సినిమాలు, వ్యక్తిత్వం, రాజకీయ జీవితంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కంచర్ల కాశయ్య, మల్లవరపు విజయ్ ప్రసంగించారు. వీరితోపాటు స్థానిక కళాకారుడు, అమ్మ డ్యాన్స్ అకాడమీ ఈశ్వర్‌ను సత్కరించారు. దేవరపల్లి భవాని, చెరుకుమల్లి సింగారావు ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, కొండముది రమేష్, వెనిగళ్ల శివప్రసాద్, ఉమ్మలనేని ధర్మారావు పాల్గొన్నారు.

రేపు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

తాడేపల్లి రూరల్: దళితులపై మతోన్మాద బీజేపీ దాడులను అరికట్టాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం మార్చి 21న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తెలిపారు. తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరం బైపాస్‌రోడ్‌లోని కేబీ భవన్‌లో కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్, ఉభయ వ్యవసాయ కార్మిక, దళిత, గిరిజన సంఘాల నాయకులతో కలసి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మత విద్వేషాలు రెచ్చగొడుతూ దళితులపైన, ముస్లిం మైనార్టీలపైన దాడులు చేస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కలతో పాటు కుల ప్రాతిపదికపై విడిగా జనాభా లెక్కలు సేకరించాలని, పవర్ ఆఫ్ అటార్నీ చట్టాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 రోజులు పనిదినాలు, రోజు వారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేవీపీఎస్ గుంటూరు జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సప్తగిరి సంకీర్తన

200 మందికిపైగా గానం



గానాలాపన

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవేంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 520వ ఆరాధనోత్సవం జరిగింది. తొలుత శ్రీవేంకటేశ్వరస్వామికి అర్చన చేసి, పొత్తూరి వెంకట ఆదిలక్ష్మి సంకీర్తనాగానం ప్రారంభించారు. తదుపరి కంకిపాటి పద్మావతి బృందం కోలాట ప్రదర్శన చేసింది. గౌరావఝుల ఆంజనేయశాస్త్రి సారథ్యంలో యల్లాప్రగడ జానకి, కొండపి వసుంధర, శివసుధీర్‌కుమార్, వఝుల లక్ష్మీసునీత, నేరెళ్ల కళ్యాణి, మూర్తి అనూరాధ, సొల్లేటి శైలజ, చుండూరు ఆదిలక్ష్మి బృందాల్లోని 200 మంది గాయకులచే సప్తగిరి సంకీర్తన నాలుగు గంటలపాటు నిర్వహించారు. తెనాలిలోని గురువులకు సంస్థ తరపున సత్కారం చేశారు. డాక్టర్ కె.పురుషోత్తం, డాక్టర్ జీవనలత, వుప్పల వరదరాజులు, లక్కరాజు లక్ష్మణరావు, డాక్టర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

యానాదుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన పెంచలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చిన పెంచలయ్య

నెహ్రూనగర్: రాష్ట్రంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ యానాదుల(గిరిజన) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు చిన పెంచలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం యానాదుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో చిన పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 13లక్షలకు పైగా జనాభా కలిగిన యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. సంఘ చైర్మన్ మేకల శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌తో జూన్‌లో లక్ష మందితో విజయవాడలో యానాది గర్జన నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. వెంకట సుబ్బయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధి బి. బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ధ్యాన శిక్షణ ప్రారంభం



ధ్యానశిక్షణ నిస్తున్న గురువులు

తెనాలి: శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్నెస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా చేపట్టిన మూడురోజుల ధ్యాన శిక్షణ మహోత్సవం ఆదివారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజి మైదానంలో ప్రారంభమైంది. ఆజాదీ కా అమృతోత్సవ్ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటైన కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీరామచంద్ర మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రామకోటేశ్వరరావు మాట్లాతూ శ్రీరామచంద్ర మిషన్ ధ్యానశిక్షణతో పాటు శారీరక స్వస్థత కోసం యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు మొదలైన వాటిలో శిక్షణనిస్తూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తోందని చెప్పారు. ఈ శిక్షణలో మూడురోజులు స్థానిక ప్రజలు హాజరై ప్రయోజనం పొందాలని కోరారు. తెనాలి కో–ఆర్డినేటర్ ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్‌కు తెనాలిలో గల మూడు ధ్యానకేంద్రాల్లోనూ శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత తరగతుల అనంతరం ఆయా కేంద్రాల్లో శిక్షణ కొనసాగించవచ్చని తెలిపారు. తొలుత యోగ మాస్టర్ నాగేంద్ర ఆసనాలు, ప్రాణాయామంలో, ధ్యానశిక్షకులు ఎంఆర్‌కే మూర్తి ధాన్యశిక్షణలో తరగతులను నిర్వహించారు.

గణిత అధ్యాపకుడు పులుగు దీపక్ సేవలకు గుర్తింపు



దీపక్‌ను సత్కరిస్తున్న, కాశీ విశ్వనాథం, భవనారి సత్యనారాయణ, జయ సుబ్బారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో అడ్వాన్సెస్ ఇన్ మ్యాథమేటికల్ సైన్సెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్‌పై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా శనివారం గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. కృష్ణాజిల్లా విస్సన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న ఆయన రెండేళ్లుగా గుంటూరు, విజయవాడలలో నీట్, ఐఐటీ–జేఈఈ, ఏపీ ఈఏపీ సెట్‌కు ఉచిత శిక్షణ శిబిరాల్ని నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వరంగల్ నిట్ గణితశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ కాశీ విశ్వనాథం, జాతీయ సదస్సు డైరెక్టర్ భవనారి సత్యనారాయణ, ఎస్వీయూ గణితశాస్త్ర ఆచార్యుడు జయ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో దీపక్‌ను సత్కరించారు. తన శిష్యుడైన దీపక్ పేద, మధ్య తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయి పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తూ, వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న తీరును అభినందించారు. కాగా పులుగు దీపక్ గుంటూరు నగరంలోని పండరీపురంలో నీట్, జేఈఈ, ఏపీ ఈఏపీసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

మల్లు స్వరాజ్యానికి ఘన నివాళి

పెదకాకాని: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని ఆదివారం పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన గెరిల్లా యోధురాలు స్వరాజ్యం అని గుర్తు చేశారు. మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమాల్ని తీవ్రతరం చేయడమే ఆమెకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి. బాబూరావు, ఎ. నాగేశ్వరావు, వి. సాగర్, ఆటో యూనియన్ నాయకులు కె. ఏడుకొండలు, యాకోబు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పింఛన్లు, ఉపకార వేతనాల పంపిణీ



అవోపా ప్రతినిధులతో అరుణ్‌కుమార్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 7వ లైనులోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు పింఛన్లు, నిత్యావసర సరుకులతో పాటు విద్యార్థులకు ఉపకార వేతనాల్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యాపారవేత్త త్రిపురమల్లు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా 100 మంది వృద్ధులకు రూ.400 చొప్పున పింఛన్ ఇవ్వడం అభినందనీయమన్నారు. అవోపా అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం మాట్లాడుతూ వ్యాపారవేత్త అరుణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో 100 మంది పేదలకు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు విలువ గల నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న దోగిపర్తి శివమోహన్ విద్యార్థులకు రూ.30వేల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా ప్రతినిధులు కొత్తమాసు శ్రీనివాసరావు, ఊటుకూరి నాగేశ్వరరావు, గార్లపాటి సత్యనారాయణ, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సగరుల బైక్ ర్యాలీ



తాడేపల్లి రూరల్: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సగర ఆత్మీయ సమ్మేళనానికి బైక్ ర్యాలీగా ఆదివారం తరలివెళ్లారు. టీటీడీ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు తాడిశెట్టి మురళీమోహన్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయంగా గుర్తించబడిన విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయం చైర్మన్ పదవిని సగరలకు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి సగరులను గుర్తించి వారికి కోసం స్థలం, నిధులు కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించారని అందుకు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో గంగా భగీరథ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పందేటి సాంబశివరావు, జూట్రు ఏడుకొండలు, నాయకులు సంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, కటారి విష్ణుమూర్తి, గండికోట రాజారావు, అచ్చయ్య, కలవకొల్లు గోపిబాబు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com